క్లుప్తంగా

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



నెహ్రూనగర్: సహృదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తూర్పు నియోజకవర్గం వెంగళరావునగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్లో విద్యార్థులకు హ్యాండ్ వాష్, సబ్బులు, స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ సుద్దపల్లి రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సామగ్రిని గత 13 సంవత్సరాలుగా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.రమేష్ పాల్గొన్నారు.

కర్రసాముతో మహిళలకు రక్షణ



నగరంపాలెం: శిలంబం (కర్రసాము) క్రీడ మహిళల రక్షణకు ఉపయోగపడుతుందని, మరింతగా ప్రోత్సహించాలని జిల్లా ఏఎస్పీ (పరి పాలన) కె.సుప్రజ పేర్కొన్నారు. ఇటీవల నాలుగో జాతీయ ట్రెడిషనల్ శిలంబం చాంపియన్– 2023 పోటీలు విజయవాడలో జరిగాయి. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో 20 బంగారు పతకాలు, 7 సిల్వర్ మెడల్స్, 7 బ్రాంచ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థుల్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని తన కార్యాయలంలో ఏఎస్పీ కె.సుప్రజ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్రసాము వల్ల పిల్లలకు ధైర్యంతో పాటు ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గురువులు కిరణ్, శ్రీనివాసరావు, కర్రసాము క్రీడ జిల్లా చైర్మన్ ముంజంపల్లి శివకుమార్ పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణానికి భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 10 నుంచి 16 వరకు నిర్వహించిన అఖండ అహోరాత్ర సంపూర్ణ భగవద్గీత పారాయణానికి భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ రావడం చాలా సంతోషంగా ఉందని శ్రీ దత్తహ్యూమన్ సర్వీసెస్, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు రామిరెడ్డి, వెంకటరత్నం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ట్రస్ట్ సభ్యులైన సుస్మిత, జయలక్ష్మి 9,540 నిమిషాలపాటు భగవద్గీత పారాయణం కొనసాగించారని తెలిపారు. ఈ క్రమంలో భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ దక్కిందని వివరించారు. సమావేశంలో ట్రస్టు సభ్యులు రాజేంద్ర బాబు, యశ్వంత్ కుమార్, నాగేశ్వరరావు, నాగిరెడ్డి, రాంగోపాల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణేశ్వరుడి కల్యాణం



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల నడుమ కనుల పండువగా నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్: కృష్ణానది కనకదుర్గ వారధిపై చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. విజయవాడ నుంచి ద్విచక్ర వాహనంపై తాడేపల్లి వస్తున్న ముసలి జ్యోతిర్మయి(35) కనకదుర్గ వారధి మధ్యలో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ క్రమంలో తలకు తీవ్రంగా గాయమైంది. 108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై తండ్రి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

‘స్పందన’ ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలి

అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి

నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర అదనపు కమిషనర్ కె. లక్ష్మీ శివజ్యోతి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ స్పందన నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని చెప్పారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 31 ఫిర్యాదులు అందాయని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి– 20, ఇంజినీరింగ్ విభాగానికి– 4, రెవెన్యూ విభాగానికి– 3, ప్రజారోగ్య విభాగానికి– 1, ఉపా సెల్ విభాగానికి –3 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ రవీంద్ర, ఎస్ఈ సుందరరామిరెడ్డి, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఆర్వోలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

ఉద్యోగుల సమస్యలపై అందే ఫిర్యాదుల్ని వేగంగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు సూపరింటెండెంట్లను ఆదేశించారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఉద్యోగుల సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా 3వ సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు పేర్కొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ‘ఈస్ట్’

ఎమ్మెల్యే ముస్తఫా



డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ ప్రజలకు మౌలిక వసతులు కల్పనే ధ్యేయంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. అభివృద్ధి అంటే తూర్పు నియోజకవర్గం అని పేర్కొన్నారు. ఆయన సోమవారం 6వ వార్డులో పర్యటించారు. ముందుగా ప్రజల నుంచి స్థానిక సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో లీకైన డ్రైనేజీల్ని దగ్గరుండి పరిశీలించారు. వెంటనే వాటికి మరమ్మతుల్ని నిర్వహించాలని అధికారుల్ని ఆదేశించారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న మరమ్మతుల్ని త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి జాఫర్ ఖాన్, వార్డు ప్రెసిడెంట్ అవుల కోటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రెహమాన్, గొలుసు చంద్ర, విశాలాక్షి, ప్రమీల, గుజ్జల రామకృష్ణారెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వ తప్పిదంతో రైతులకు అవస్థ

నెహ్రూనగర్: గత టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పులు కారణంగా పాత గుంటూరులోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. పాత గుంటూరులోని రైతుల భూముల రిజిస్ట్రేషన్ ధరల్ని మార్కెట్ విలువ కంటే టీడీపీ ప్రభుత్వం 400 శాతం పెంచడంతో రైతులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఆయన సోమవారం రైతులతో కలసి తాడేపల్లిలోని రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ కమిషనర్ వి.రామకృష్ణను ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. పెంచిన రిజిస్ట్రేషన్ ధరల్ని తగ్గించి, రైతుల అభివృద్ధికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిషనర్ రామకృష్ణ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పాత గుంటూరు ప్రాంత రైతులు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా, వైఎస్సార్ సీపీ నాయకులు తోట ఆంజనేయులు, పోలవరపు వెంకటేశ్వరరావు, రామనబోయిన అజయ్, యర్రి సాయి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శివరామిరెడ్డి

లక్ష్మీపురం: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికీ అర్హులైన యువతలో 40 శాతం మంది ఓటరుగా నమోదు కాకపోవడం విచారించదగ్గ విషయమని తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యా సంస్థ యాజమాన్యాలు, అధ్యాపక బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కళాశాల విద్యార్థులతో ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు చేస్తున్న కృషికి కూడా అంతా సహకరించాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల వి.ఎస్.ప్రసాదరావు, న్యాయవాది అవధానుల హరి, విశ్రాంతి అధికారి శేషగిరిరావు పాల్గొన్నారు.

పెదకాకాని పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర ఆరోగ్య బృందం



పెదకాకాని: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కేంద్ర ఆరోగ్య బృంద సభ్యులు సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల్ని పరిశీలించారు. ముందుగా ఆసుపత్రికి ప్రతి రోజూ వస్తున్న రోగుల సంఖ్య, మందుల పంపిణీ రికార్డులు, రిజస్టర్లు తనిఖీ చేశారు. మండలంలో రక్తపోటు, షుగరు వ్యాధితో బాధపడుతున్న వారి వివరాలు పరిశీలించి, వారికి ఎఫ్‌డీపీ ద్వారా అందుతున్న సేవల్ని పర్యవేక్షించారు. అనంతరం ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఐవీఏ టీమ్ డాక్టర్ సందేశ్, డాక్టర్ వరప్రసాద్, స్థానిక మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పులుసూరి ప్రవీణ దీప్తి, డాక్టర్ సింధూర, సూపర్‌వైజర్ పుసులూరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో పేదలకు భరోసా



ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో పాల్గొన్న ఫాతిమా

నెహ్రూనగర్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సిఫార్సులు లేకుండా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 14వ వార్డు డీఎస్ నగర్‌లో సోమవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడికి తానున్నాననే భరోసా కల్పిస్తున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో సీఎం పీఠంపై తిరిగి కూర్చోబెట్టేందుకు సహకరించాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వేముల జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జి. నాగేశ్వరరావు, మురళి, గోపీ నాయుడు, యాదాల రామ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

3వ వార్డులో...

రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యమవుతుందని నమ్మి 2019లో ఎన్నికల్లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ మెజార్టీతో గెలిపించారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలి ? కార్యక్రమాన్ని సోమవారం మూడో వార్డు బాలాజీ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ సేవకుడ్ని గెలిపించుకునేందుకు రాష్ట్ర ప్రజలంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వరరావు, తోట ఆంజనేయులు, సాదం సురేష్, అల్లం అంకమ్మ రావు, మస్తాన్ పాల్గొన్నారు.

11వ వార్డులో...

తూర్పు నియోజకవర్గం అభివృద్ధిపై వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా వెల్లడించారు. సోమవారం 11వ వార్డు ఆంధ్ర ముస్లిం కాలేజీ వెనుక ఉన్న కిద్వాయ్ నగర్‌లో ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు సగం సగం పనులు చేసి మధ్యలో వదిలేశాయని, కానీ తమ ప్రభుత్వం వచ్చాక పూర్తి చేసి చూపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అబిద్ బాషా, వైఎస్సార్ సీపీ బుజ్జి, సుబ్బారెడ్డి, గౌస్, ఫజల్ పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే సంస్కృతి మూలాలను నేర్పించాలి

భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ



శతక పద్య పఠనం గావిస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ సంస్కృతి, దాని మూలాల్ని చిన్ననాటి నుంచే విద్యార్థులకు నేర్పించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చునని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. భాష్యం విద్యాసంస్థల సౌజన్యంతో సోమవారం గుంటూరులోని భాష్యం అన్ని క్యాంపస్‌లలో అమ్మ, నాన్న, గురువు పద్యార్చన (శతక పద్య పఠనం) నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భాష్యం స్కూలు విద్యార్థులు చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ, నాన్న, గురువు శతకాల్లోని పద్యాల్ని కంఠస్థం చేసి, సామూహిక గానం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు పెద్దలపై గౌరవం పెంచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. శతక పద్య పఠనం జ్ఞాపకశక్తిని పెంచి, మానవ మేధస్సుని ద్విగుణీకృతం చేస్తుందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల్ని నిర్వహించడంలో భాష్యం ఎప్పుడు ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు భాష్యం విద్యాసంస్థల జెడ్ఈవోలు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంట కోత ప్రయోగం



చేబ్రోలు: మండలంలోని శలపాడు గల ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం వ్యవసాయాధికారులు పంటకోత ప్రయోగం నిర్వహించారు. పీఎండీఎస్ వేసిన రైతు పొలంలో తుఫాన్ ప్రభావానికి కూడా పంట పడిపోకుండా నిలబడి ఉండటం వల్ల అధిక దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. ఎకరాకు 41 బస్తాలు ధాన్యం దిగుబడి వచ్చినట్లు రైతు సాధికార సంస్థ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ మాధవి తెలిపారు. రబీ పంట అయిన తర్వాత భూమిని ఖాళీగా ఉంచకుండా వ్యర్థాల్ని కలియదున్ని పీఎండీఎస్ ద్వారా ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని ఆమె రైతులకు సూచించారు. దిగుబడి కూడా అధికంగా రావడంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ ఉమాదేవి, అఖిలాష్, రైతులు పాల్గొన్నారు.

కెనడీ స్కూలు విద్యార్థికి అబ్దుల్ కలాం అవార్డు



విద్యార్థి కార్తికేయకు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్, సుగుణ సైన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో కెనడీ స్కూల్ మెరిట్ క్యాంపస్ 9వ తరగతి విద్యార్థి కె. జయరామ్ కార్తికేయ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్‌స్పిరేషన్ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్. ఐజక్‌కుమార్ సోమవారం తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన 13వ రాష్ట్రస్థాయి విజ్ఞాన గురు, డాక్టర్ అబ్దుల్ కలాం ఇన్‌స్పిరేషన్ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా తమ పాఠశాల విద్యార్థి అబ్దుల్ కలాం అవార్డు అందుకోగా, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్. హరగోపాల్ డాక్టర్ అబ్దుల్ కలాం హెల్పింగ్ హ్యాండ్ సేవా పురస్కార్‌తో సత్కరించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి జయరామ్ కార్తికేయతో పాటు ఉపాధ్యాయుడు హరగోపాల్‌ను కెనడీ స్కూల్ డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు డాక్టర్ కె.శ్రీవిద్య, వైస్ ప్రిన్సిపాల్ వి. చైతన్య అభినందించారు.

డ్యాన్స్ పోటీల్లో ప్రథమ, తృతీయ స్థానాలు

విద్యార్థులు విద్యతో పాటు కళారంగాల్లో రాణించడం అభినందనీయమని కెనడీస్ నెక్స్ట్‌జెన్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్లు కె.శ్రీక్రాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య అన్నారు. అరండల్‌పేటలోని నెక్స్ట్‌జెన్ కిడ్స్ పాఠశాలలో సోమవారం డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల్ని అభినందించారు. ఏపీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో కెనడీస్ నెక్స్ట్‌జెన్ కిడ్స్ పాఠశాల నుంచి రిషితా గ్రూప్ బాలికలు, సాయి చరణ్ గ్రూప్ బాలురు వరుసగా ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారు. గెలుపొందిన విద్యార్థుల్ని పాఠశాల డైరెక్టర్ శ్రీవిద్య, ఇన్‌చార్జి వసంత లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధాన్యం కాటాలో మోసం.. రైతుల ఆందోళన



వేబ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ

పొన్నూరు: వేబ్రిడ్జి తూకంలో మోసం చేస్తూ ధాన్యం కొనుగోళ్లలో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ మండలంలోని మన్నవ గ్రామ రైతులు సోమవారం ఆందోళన చేశారు. ప్రతి రోజు ధాన్యాన్ని తూకం వేసే క్రమంలో భారీస్థాయిలో మోసానికి పాల్పడుతున్నారంటూ రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని కట్టెంపూడిలో వేబ్రిడ్జి నిర్వాహకులు కొందరు రైసుమిల్లుల వారితో కుమ్మక్కై మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మండలంలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ధాన్యం లారీలు, ట్రాక్టర్లు బారుల తీరడంతో హడావుడిగా ధాన్యం కాటా వేసి రసీదులు ఇచ్చి పంపిస్తున్నారు. తర్వాత రైతులు ధాన్యాన్ని తీసుకువెళ్లి రైసుమిల్లులో విక్రయించాల్సి ఉంది. ఈ క్రమంలో మన్నవ గ్రామ రైతులకు చెందిన లారీ తూకంలో 11 క్వింటాళ్ల తేడా చూపించారు. మరో ట్రాక్టర్‌లో నాలుగున్నర క్వింటాళ్ల తేడా చూపించడంతో పసిగట్టిన రైతులు వేబ్రిడ్జి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని అధికారుల్ని కోరారు. సమాచారం తెలుసుకున్న తూనికల అధికారులు, రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ధాన్యం తూకంలో వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు కూడా గుర్తించారు. రైతుల ఫిర్యాదు మేరకు శ్రీ లక్ష్మీ శ్రీనివాస వేబ్రిడ్జిలో తనిఖీలు చేయగా, తూకంలో తేడాను గుర్తించినట్లు తూనికల కొలతల జిల్లా అధికారి కొండారెడ్డి తెలిపారు. సంబంధిత రైతు 250 కిలోల వరకు నష్టపోయినట్లు గుర్తించామని చెప్పారు. వేబ్రిడ్జి నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మొబైల్ టెక్నాలజీపై అవగాహన అవసరం

తాడేపల్లి రూరల్: వెబ్ , మొబైల్ అప్లికేషన్‌లపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కేఎల్ యూనివర్సిటీ, కేఎల్ టెక్నాలజీ ఇంక్యుబేటర్స్ ఫౌండేషన్ సీఈవో అలోక్ గోవిల్ సూచించారు. విశ్వవిద్యాలయంలో వెబ్, మొబైల్ అప్లికేషన్ల కార్యశాల సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అలోక్ గోవిల్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో వెబ్ సర్వీస్, మొబైల్ అప్లికేషన్‌లకు డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. ఆ రంగాల్లో నూతన ఆవిష్కరణలకు మంచి అవకాశాలు లభిస్తాయని వివరించారు. సైద్ధాంతిక పరిజ్ఞానం బేసిక్స్, ఆచరణాత్మక అనుభవం కలయికతో కోడింగ్ చిక్కులను మరింత సులభంగా అర్థం చేసుకునే విధంగా ప్రయోగాత్మక ప్రాజెక్ట్‌లపై పని చేయాలని విద్యార్థులకు ఆయన తెలిపారు.

విజ్ఞాన్ యూనివర్సిటీతో సీఎస్‌సీ అకాడమీ ఒప్పందం



సీఎస్‌సీ అకాడమీ ఎగ్జిక్యూటివ్ మోహన్‌కు పత్రాలను అందజేస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ రావు

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ భారత ప్రభుత్వంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ విభాగంతో నిర్వహించబడుతున్న విశాఖపట్నంలోని సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) అకాడమీతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని వీసీ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎస్‌సీ అకాడమీ వర్చువల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ రామ్ మోహన్‌తో వర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పి.ఎం.వి.రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాల్ని మార్చుకున్నారు. ఒప్పందం వల్ల 8,000 విద్యార్థులతో పాటు అధ్యాపకులకు కూడా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్ని నిర్వహిస్తామని వీసీ తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీపై ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తామని చెప్పారు. అకాడమీ వర్చువల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ రామ్ మోహన్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు ఇండస్ట్రీ లేదా వృత్తితో సంబంధం లేకుండా డిజిటల్ ప్రపంచంలో వస్తున్న సాంకేతికతను స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వీవీఐటీలో బబుల్ గమ్ చిత్ర బృందం సందడి



కళాశాలలో చిత్ర బృందం ఆటాపాటా

పెదకాకాని: సీనియర్ నటుడు రాజీవ్ కనకాల, ప్రముఖ యాంకర్ సుమ దంపతుల కుమారుడు రోషన్ కనకాల ప్రధాన పాత్రలో మానస చౌదరి హీరోయిన్‌గా రవికాంత్ పారెపు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రేమకథ చిత్రం బబుల్ గమ్ బృందం వీవీఐటీలో సందడి చేసింది. ఈ చిత్రం డిసెంబరు 29న విడుదల కానున్న నేపథ్యంలో కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి నంబూరు వీవీఐటీని సందర్శించింది. హీరో రోషన్ మాట్లాడుతూ ఈ చిత్రం యువతను విశేషంగా ఆకట్టుకుంటుందని తెలిపారు. యుక్తవయస్సులో ఏదైనా సాధించాలి అనిపించినపుడు అవరోధాలు ఎదురొస్తే ఎలా ఎదుర్కోవాలి ? అనే సందేశాన్ని ఈ చిత్రం అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో హీరో రోషన్, హీరోయిన్ మానస, డైరెక్టర్ రవికాంత్, నటుడు జబర్దస్త్ రాంప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

గోదా దేవికి సారె సమర్పణ



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై త్రిదండి చిన్న జీయర్ స్వామి మంగళ శాసనాలతో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ఉదయం గోదా అమ్మవారికి అష్టోత్తర శతనామార్చన, సారె సమర్పణ కార్యక్రమాలు నిర్వహించామని, అనంతరం పాశుర విన్నపం, ఇంటింటి ధనుర్మాసం కార్యక్రమంలో భాగంగా భక్తుల ఇళ్లలో గోదాదేవి కల్యాణం నిర్వహించామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



ప్రయాణికురాలికి బహుమతి అందిస్తున్న ప్రసాదరావు

పొన్నూరు: ఆర్టీసీని ఆదరించే ప్రయాణికులకు బహుమతులు అందిస్తున్నట్లు డిపో మేనేజర్ అజిత కుమారి తెలిపారు. డిపో పరిధిలోని నిజాంపట్నం, తెనాలి, వట్టిచెరుకూరు మార్గాల్లో ప్రయాణికులు బస్సు దిగే సమయంలో టికెట్‌పై తమ ఫోన్ నంబర్ రాసి లక్కీ డిప్ బాక్స్‌లో వేశారని ఆమె చెప్పారు. సోమవారం వాటిని డ్రా తీసినట్లు పేర్కొన్నారు. విజేతలైన అమీనాబేగం, విజయలక్ష్మి, సృజనలకు అగ్నిమాపక శాఖ అధికారి ప్రసాదరావు బహుమతులు అందజేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.